సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 1 । జూలై । 2025



దర్శన సంబురం

వేములవాడ: రాజన్నను సోమవారం 30వేల మంది భక్తులు దర్శించుకున్నారు. బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. రూ.25లక్షల ఆదాయం సమకూరింది.



ఆలయ ఉద్యోగులకు సత్కారం

వేములవాడ: ఆలయంలో స్కావెంజర్లుగా విధులు నిర్వహించి సోమవారంతో రిటైర్మెంట్ పొందిన తాండ్ర మణెమ్మ, పిట్టల భద్రమ్మ, కుమ్మరి బూదమ్మలను సోమవారం సత్కరించారు.

గరిష్టం/కనిష్టం
30.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

పిల్లల చేయిపట్టి.. సర్కార్ బడికి జైకొట్టి

- తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన టీచర్లు
- స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న ఉద్యోగులు



ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం.. గవర్నమెంట్ టీచర్లపై భరోసా పెంచాలనే పలువురు ఉపాధ్యాయులు తమ పిల్లలను సర్కార్ బడికి పంపుతున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన ఉంటుందని చెప్పేందుకే తాము పనిచేస్తున్న స్కూళ్లకు పిల్లలను తీసుకెళ్తున్నారు. సార్లే.. తమ పిల్లలను ఊరిలోని బడికి తీసుకొస్తుంటే.. మిగతా తల్లిదండ్రులు తమ పిల్లలనూ చేర్పిస్తున్నారు. ఇటీవల ఉపాధ్యాయులు చేపట్టిన బడి బాటలో విద్యార్థుల సంఖ్య పెరగడానికి ఇదే కారణం. తమ పిల్లలను సర్కార్ బడికి పంపుతున్న ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలుస్తున్నారు.



కొడుకు అయాన్ అద్వైత్‌కు పుస్తకాలు అందజేస్తున్న తండ్రి భూక్య తిరుపతి

బడిపై నమ్మకం కల్పించాలని

రుద్రంగి(వేములవాడ): తన ముగ్గురు పిల్లలనూ సర్కార్ స్కూళ్లలోనే చదివిపిస్తున్నారు రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం వీరునితండాకు చెందిన టీచర్ భూక్య తిరుపతి. రుద్రంగి ప్రైమరీ స్కూల్‌లో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న భూక్య తిరుపతికి భూక్య ప్రీతిజ, భూక్య నిహారిక, భూక్య అయాన్ అద్వైత్ పిల్లలు. నిహారికను గతంలో తాను పనిచేసిన రుద్రంగి ప్రైమరీ స్కూల్‌కు తీసుకెళ్లేవారు. ప్రస్తుతం మానాలలోని స్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్న తిరుపతి తన కొడుకు అయాన్ అద్వైత్‌ను అదే పాఠశాలకు వెంట తీసుకెళ్తున్నారు. ఇద్దరు కూతుళ్లు భూక్య ప్రీతిజ 10వ తరగతి, భూక్య నిహారిక 7వ తరగతి.. గురుకులాల్లో చదువుతున్నారు.

తల్లిదండ్రుల బడికి కొడుకు

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం దుంపేటకు చెందిన గుండేటి రవికుమార్–పద్మలత దంపతులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరు మండలంలోని పోసానిపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ దంపతుల చిన్నకుమారుడు లౌకిక్ నాలుగో తరగతి వారు పనిచేస్తున్న పోసానిపేట ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నాడు. నిత్యం తమ వెంటే స్కూల్‌కు తీసుకెళ్తున్నారు. వీరిని చూసి గ్రామంలోని తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను పాఠశాలకు పంపడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది.

తల్లిదండ్రులకు విశ్వాసం కల్పించాలని..



పిల్లలతో స్రవంతి

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన స్రవంతి కరీంనగర్‌రూరల్ మండలం చెర్లభూత్కూర్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో మ్యాథ్స్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. స్వస్థలం పెద్దపల్లి జిల్లా ధూళికట్ట కాగా కరీంనగర్‌లో నివాసముంటున్నారు. భర్త శ్రీకాంత్ ల్యాబ్ టెక్నీషియన్. కూతురు అమూల్య 6వ తరగతి, కుమారుడు సాయిమోక్షిత్ 4వ తరగతి చదువుతున్నారు. గతంలో వీరు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువగా.. ప్రస్తుతం తల్లి వెంటే చెర్లభూత్కూర్ ప్రభుత్వ బడికి వెళ్తున్నారు. గ్రామంలోని తల్లిదండ్రులకు ప్రభుత్వ బడిపై నమ్మకం కల్పించేందుకు తన పిల్లలనూ అక్కడే చదివిపిస్తున్నట్లు టీచర్ స్రవంతి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలు



బైక్‌పై పాఠశాలకు తీసుకొస్తున్న అనిల్‌కుమార్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం మండలం న్యూమారేడుపాక లోని నర్సింహపురం(ఎంపీపీఎస్) ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు వి.అనిల్‌కుమార్ తన ఇద్దరు కుమారులను అదే పాఠశాలలో చదివిపిస్తున్నారు. పెద్దకుమారుడు శ్రీహన్ 5వ తరగతి, చిన్నకుమారుడు 2వ తరగతి చదువుతున్నారు. వారిద్దరిని నిత్యం తనతోపాటు బైక్‌పై ప్రభుత్వ బడికి తీసుకొస్తున్నాడు. తను పనిచేస్తున్న పాఠశాలలోనే ఇద్దరు పిల్లలను చదివిపిస్తూ.. గ్రామంలోని తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచినట్లు టీచర్ అనిల్‌కుమార్ తెలిపారు.

- వివరాలు 8లో▶

న్యూస్‌రీల్

ముంపు గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సిరిసిల్ల: మధ్యమానేరు ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రత్యేక శిబిరాలు నిర్వహించి దరఖాస్తులు తీసుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం బోయినపల్లి మండలంలోని ముంపు గ్రామాలు కొదురుపాక, వరదవెల్లి, నీలోజిపల్లి నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే సత్యం అర్హులందరికీ పరిహారం, మిగతా ప్రయోజనాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దరఖాస్తులపై మరోసారి అధికారులతో సర్వే చేయిస్తామని తెలిపారు. కొదురుపాకలో గురువారం, వరదవెల్లిలో శుక్రవారం, నీలోజిపల్లిలో శనివారం రెవెన్యూ అధికారులు ప్రత్యేక శిబిరం నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తారని స్పష్టం చేశారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, వేములవాడ ఆర్డీవో, ఎస్‌డీసీ రాధాబాయ్, బోయినపల్లి తహసీల్దార్ నారాయణరెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, ముంపు గ్రామాల ఐక్యవేదిక ప్రతినిధి కూస రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేతో భరోసా



సిరిసిల్లక్రైం: సమస్యల పరిష్కార లక్ష్యంగా, బాధితులకు భరోసాగా నిలిచేందుకు గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మహేశ్ బీ గీతే పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ఆఫీస్‌లో సోమవారం 27 ఫిర్యాదులు స్వీకరించారు. వెంటనే పరిష్కరించాలని ఆయా ఠాణాల అధికారులకు సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి



ఇల్లంతకుంట(మానకొండూర్): వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో రజిత సూచించారు. స్థానిక పీహెచ్‌సీని సోమవారం తనిఖీ చేశారు. మందుల నిల్వలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శాంత ఉద్యోగ విరమణ సందర్భంగా ఆమెను సన్మానించారు. వైద్యులు శరణ్య, జీవనజ్యోతి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అంజేలియో ఆల్ఫ్రెడ్, నయీమ్‌జహ, రామకృష్ణ, అనిత, హెచ్‌ఈవో వెంకటరమణ ప్రసాద్ పాల్గొన్నారు.

సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా ఖదీర్‌పాషా



సిరిసిల్ల: మున్సిపల్ కమిషనర్‌గా ఖదీర్‌పాషా సోమవారం విధుల్లో చేరారు. నిజామాబాద్ మున్సిపల్ నుంచి పదోన్నతిపై సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బదిలీ అయ్యారు. ఇన్‌చార్జి కమిషనర్ పి.వాణి పూలమొక్క అందించి స్వాగతం పలికారు. మున్సిపల్ డీఈఈగా ఉన్న వాణి ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. పూర్తిస్థాయి కమిషనర్ రావడంతో ఆమె డీఈఈగా కొనసాగనున్నారు. టీపీవో సాయికృష్ణ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఇరిగేషన్ ఇన్‌చార్జి ఈఈగా ప్రశాంత్



సిరిసిల్ల: జిల్లా నీటిపారుదల శాఖ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌గా టి.ప్రశాంత్ బాధ్యతలు స్వీకరించారు. చందుర్తిలో ఇరిగేషన్ డీఈఈగా విధులు నిర్వహించే ప్రశాంత్‌కు ఇరిగేషన్ శాఖ ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

'మొక్క'వోని లక్ష్యం చేరేనా!

- జిల్లాలో 6.77లక్షల మొక్కలు లక్ష్యం
- నర్సరీల్లో 12 లక్షల మొక్కలు సిద్ధం
- గ్రామీణులకు అవగాహన కరువు
- లక్ష్యం చేరడంపై అనుమానాలు

వనమహోత్సవం లక్ష్యం

బోయినపల్లి	30వేలు
చందుర్తి	70వేలు
ఇల్లంతకుంట	76వేలు
గంభీరావుపేట	76వేలు
కోనరావుపేట	80వేలు
ముస్తాబాద్	75వేలు
రుద్రంగి	10వేలు
తంగళ్లపల్లి	75వేలు
వీర్నపల్లి	10వేలు
వేములవాడ(ఆర్)	20వేలు
వేములవాడ అర్బన్	10వేలు
ఎల్లారెడ్డిపేట	80వేలు
సిరిసిల్ల మున్సిపల్	2.08లక్షలు
వేములవాడ మున్సిపల్స్	2.08లక్షలు



పోతుగల్‌లో నామమాత్రంగా నిర్వహిస్తున్న నర్సరీ

ముస్తాబాద్(సిరిసిల్ల): పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా చేపట్టిన వనమహోత్సవం నీరసంగా కొనసాగుతోంది. గ్రామీణులకు ఈ కార్యక్రమంపై అవగాహన లేకపోవడంతో ముందుకురావడం లేదు. ఉపాధిహామీలో నాటాల్సిన మొక్కలపై అధికారుల నిర్లక్ష్యానికి లక్ష్యం పూర్తయ్యేలా లేదు. జిల్లాలో 6.77లక్షల మొక్కలు నాటాలన్న లక్ష్యం చేరడం అనుమానంగా కనిపిస్తుంది. గతేడాది ఉపాధిహామీలో 6.06లక్షల మొక్కలు నాటారు.

తూతు మంత్రంగా నర్సరీలు

జిల్లాలో 255 నర్సరీల్లో నామమాత్రంగానే మొక్కల పెంపకం చేపట్టినట్లు విమర్శలు వస్తున్నాయి. జిల్లాలోని అత్యధిక నర్సరీల్లో 3వేల మొక్కలు పెంచారు. అయితే కొన్ని మొక్కలు సరిగ్గా ఎదగలేవు. కొన్ని నర్సరీల్లో ఖాళీ కవర్లే కనిపిస్తున్నాయి. కొన్ని నర్సరీల్లో గతేడాది పెంచిన మొక్కలే కనిపిస్తున్నాయి. వైద్యారోగ్యశాఖ 2వేలు, విద్యాశాఖ 2వేలు, ఇరిగేషన్ 7వేలు, పోలీస్‌శాఖ 4వేలు, వ్యవసాయశాఖ 22వేలు, ఉద్యానవనశాఖ 6వేల మొక్కలు పెంపకం లక్ష్యంగా పెట్టుకున్నారు.

కమ్యూనిటీ ప్రదేశాల్లోనే పెంపకం

జిల్లాలో పది విడతల్లో హరితహారంలో చేపట్టిన మొక్కల పెంపకంతో ఖాళీ ప్రదేశాలు లేకుండా పోయాయి. ప్రభుత్వ, బంజేరు భూములతోపాటు రోడ్లు, కాల్వల వెంట పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. వనమహోత్సవంలో కులసంఘాల భవనాలు, ఖాళీ ప్రదేశాలతోపాటు ఎండిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాటే కార్యక్రమాలు చేపట్టారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో గుంతలు తీసి పెట్టుకున్నారు.

ప్రజలను చైతన్యవంతులను చేయాలి



హరితహారాన్ని ప్రజా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లి ప్రభుత్వ భూముల్లో వేలాది మొక్కలు నాటాం. గత రెండు విడతల్లో మొక్కల నాటడంపై ప్రజలను చైతన్యవంతులను చేయడం లేదు. దీనిపై అధికారులు ఎలాంటి కార్యక్రమాలను తీసుకోవడం లేదు. నామమాత్రంగా మొక్కలు నాటుతున్నారు.

– గాదిచర్ల దేవయ్య, మాజీ సర్పంచ్, చిప్పలపల్లి

మొక్కలు నాటాలి



ముస్తాబాద్ మండలంలో ఇప్పటి వరకు ఈ సీజన్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టలేదు. పర్యావరణ పరిరక్షణకు అధికారులు చర్యలు చేపట్టాలి. కేంద్ర పథకం ఉపాధిహామీ ద్వారా మొక్కల నాటే కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేసి విజయవంతం చేయాలి.

– సొల్ల క్రాంతికుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు

త్వరలోనే మొక్కలు నాటుతాం

మొన్నటి వరకు ఎండలు తీవ్రంగా ఉండడంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టలేదు. నర్సరీల్లో నాణ్యమైన మొక్కలను ఎంచుకుని నాటేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో గుంతలు తీయించాం. త్వరలోనే ఊరూరా మొక్కలు నాటుతాం.

– ఆనంద్ మోహన్, ఏపీవో, ముస్తాబాద్

అర్జీలు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించి

- ప్రజావాణిలో 157 దరఖాస్తుల స్వీకరణ
- సమస్యలు ఆలకించిన కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లఅర్బన్: క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాక బాధితులు కలెక్టరేట్ బాట పడుతున్నారు. జిల్లా నలుమూలల నుంచి సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణికిభారీగా బాధితులు తరలివచ్చారు. అర్జీదారుల నుంచి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయి, డీఆర్‌డీవో శేషాద్రి అర్జీలు స్వీకరించారు. ఈ ప్రజావాణిలో మొత్తం 157 దరఖాస్తులు వచ్చాయి. ఆయా దరఖాస్తులను పరిశీలిస్తూ పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు.

గురుకులంలో సమస్యలు పరిష్కరించాలి



సిరిసిల్ల పట్టణ పరిధిలోని చిన్న బోనాల బాలికల గురుకులంలోని సమస్యలు పరిష్కరించాలి. పాఠశాలలో శానిటైజర్ సమస్య తీవ్రంగా ఉంది. విద్యార్థులకు సరైన సమయంలో భోజనం పెట్టడం లేదు. బాత్‌రూమ్‌లు సరిగ్గా శుభ్రం చేయడం లేదు.

– పంగ రవి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు

బిల్లులు ఇప్పించండి



మన ఊరు..మన బడిలో భాగంగా పాఠశాలలో డైనింగ్‌హాల్, తరగతిగదుల్లో ఎలక్ట్రీషియన్ పనులు చేపట్టాను. రెండేళ్లు దాటినా బిల్లులు రాలేదు. కాబట్టి మన ఊరు..మన బడిలో చేపట్టిన పనులకు అధికారులు స్పందించి బిల్లులు ఇప్పించాలి.

– గొడిశెల మల్లేశంగౌడ్, పెద్దలింగాపూర్

హాస్టల్ సౌకర్యం కల్పించాలి



బెస్ట్ అవైలేబుల్ స్కూళ్లకు ఎంపికైన విద్యార్థులకు చదువుతోపాటు హాస్టల్ వసతి కల్పించాలి. మా పిల్లలు తంగళ్లపల్లిలోని సరస్వతి హైస్కూల్‌లో చదువుతున్నారు. ఈ విద్యాసంవత్సరం స్కూల్ యాజమాన్యం హాస్టల్ సౌకర్యం లేదంటుంది. ప్రభుత్వం రెండేళ్లుగా బిల్లులు ఇవ్వకపోవడంతోనే హాస్టల్ సౌకర్యం కల్పిస్తలేమని స్పష్టం చేసింది. కలెక్టర్ స్పందించి స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థులకు న్యాయం చేయాలి.

– బెస్ట్ అవైలేబుల్ విద్యార్థుల తల్లిదండ్రులు

పిల్లల పోషణ కష్టంగా మారింది



మాది ఇల్లంతకుంట మండలం రేపాక. నా భర్త మృతిచెందాడు. నా ముగ్గురు పిల్లల్లో ఒకరు వికలాంగురాలు. నా భర్త లేకపోవడంతో పిల్లల పోషణ భారంగా మారింది. నాకు వితంతు పెన్షన్, నా కూతురికి వికలాంగుల పెన్షన్ మంజూరు చేసి ఆదుకోండి.

– రజిత, రేపాక

మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- 37 మందికి రూ.38 లక్షల రుణాలు



మహిళకు రుణచెక్కును అందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, డీఆర్‌డీవో శేషాద్రి

సిరిసిల్ల: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం బాటలు వేస్తోందని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం 37 మంది మహిళలకు రూ.38లక్షల బ్యాంకు రుణాలు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. తీసుకున్న రుణాలతో ఆర్థికంగా బలోపేతమై.. తిరిగి చెల్లించాలని కోరారు. ముస్తాబాద్ మండలంలో 14 మందికి రూ.14.96లక్షలు, తంగళ్లపల్లిలో ఒక్కరికి రూ.30వేలు, గంభీరావుపేటలో 8 మందికి రూ.7.66లక్షలు, వీర్నపల్లి మండలంలో ఇద్దరికి రూ.2.67లక్షలు, ఎల్లారెడ్డిపేట మండలంలో 12 మందికి రూ.13.04లక్షల రుణాలు అందించారు. మహిళా సంఘాల సభ్యులు ఇద్దరు ప్రమాదశాత్తు మరణించగా వారి కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున ఆర్థికసాయాన్ని పంపిణీ చేశారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, డీఆర్డీవో శేషాద్రి, జెడ్పీ సీఈవో వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ్ కాంపిటీషన్ పోస్టర్ ఆవిష్కరణ

జిల్లాలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు నేషనల్ స్టూడెంట్ పర్యావరణ్ కాంపిటీషన్–2025 పోస్టర్‌ను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సోమవారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా నీటిసంరక్షణ, చెట్లు నాటడం, తడి పొడిచెత్త వేరు చేయడం అనే అంశాల మీద అవగాహన కల్పించాలన్నారు. జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, డీవైఎస్‌వో రాందాస్, జాతీయ హరిత దళం కోఆర్డినేటర్ పాముల దేవయ్య పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయండి

సిరిసిల్లటౌన్: కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ జూలై 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక నాయకులు కోరారు. ఈమేరకు సమ్మె నోటీసును జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సోమవారం అందజేశారు. అన్నల్‌దాస్ గణేశ్, నాయకులు బెజుగం సురేష్ పాల్గొన్నారు.

'బెల్టు'పై సమరం



సిరిసిల్లటౌన్/సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రానికి సమీపంలోని చంద్రంపేటలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపును తొలగించాలని కోరుతూ మహిళలు సోమవారం ఠాణా ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ బెల్టుషాపునకు వచ్చే తాగుబోతుల నుంచి స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. బెల్టుషాపును తొలగించకపోతే తమకు చావడానికి పర్మిషన్ ఇవ్వాలని కోరారు. వి.నర్సవ్వ, మణెవ్వ, లక్ష్మి, లావణ్య, శాంత, అంజలి తదితరులు పాల్గొన్నారు. వీరి ఆందోళనతో సీఐ కృష్ణ చంద్రంపేటకు వెళ్లి విచారణ చేపట్టినట్లు తెలిపారు. గతంలోనే వారిని బైండోవర్ చేశామని, ప్రస్తుతం అక్కడ ఎలాంటి బెల్టుషాపు నిర్వహిస్తలేరని స్పష్టం చేశారు.



ఎస్సీ గురుకులంలో వంట చేస్తున్న సిబ్బంది, మాజీ కౌన్సిలర్ నాగరాజు

జ్ఞానం పంచుతాం.. ఆకలి తీరుస్తాం

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని పదోవార్డు చిన్నబోనాలలోని ఎస్సీ గురుకుల హాస్టల్‌లో మెస్ కాంట్రాక్టర్ సరిగ్గా విధులకు హాజరుకాకపోవడంతో ఉపాధ్యాయినులు వంట చేశారు. మెస్ కాంట్రాక్టర్‌కు సమయానికి రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో విద్యార్థుల ఆకలి తీర్చేందుకు మహిళా టీచర్లు వంట చేసి వడ్డించారు. 540 మంది విద్యార్థులు ఉన్న హాస్టల్‌లో ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు విద్యార్థులకు భోజనం అందలేదు. ఈ విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ సోమవారం స్కూల్‌కు చేరుకొని పాఠశాల సిబ్బందితో కలిసి విద్యార్థులకు వంట చేసి వడ్డించారు.

క్లుప్తంగా

'మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు'



నేతకార్మికులకు కౌన్సిలింగ్ ఇస్తున్న పున్నంచందర్

సిరిసిల్లటౌన్: మానసిక సమస్యలపై నిర్లక్ష్యం చేయొద్దని మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ సైకాలజిస్టు పున్నంచందర్ సూచించారు. ప్రగతినగర్‌లోని నేతకార్మికులకు సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. నిద్రలేమితో మానసిక సమస్యలు, శారీరక అనారోగ్యాలు వస్తాయన్నారు. జీవనశైలిలో మార్పులతో బ్లడ్‌ప్రెషర్, డయాబెటీస్, క్యాన్సర్స్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. అనుకూల దృక్పథంతో ముందుకెళ్లాలని సూచించారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలను తొలగించేందుకు మైండ్‌కేర్ సెంటర్ ద్వారా ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మైండ్‌కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ సిబ్బంది కొండ ఉమ, రాపెల్లి లత, బూర శ్రీమతి పాల్గొన్నారు.

ఆర్టీసీ టూర్ ప్యాకేజీకి స్పందన

- సిరిసిల్ల డీఎం ప్రకాశ్‌రావు



డీఎం ప్రకాశ్‌రావుతో ప్రయాణికులు

సిరిసిల్లటౌన్: ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆధ్యాత్మికత యాత్రలకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన వచ్చిందని సిరిసిల్ల డీఎం ప్రకాశ్‌రావు పేర్కొన్నారు. ఈనెల 27న సిరిసిల్ల నుంచి వివిధ ఆలయాల సందర్శనకు ఆర్టీసీ ప్రవేశపెట్టిన టూర్ ప్యాకేజీ విశేషాలను సోమవారం మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక బస్సు నడపడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారన్నారు. అరుణాచలం. మంత్రాలయం, భద్రాచలం, పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. 30 నుంచి 40 మంది ప్రయాణికులు సిద్ధంగా ఉంటే బస్సును ఏర్పాటు చేస్తామని తెలిపారు. వివరాలకు 90634 03971, 6304 17121, 73828 50616, 99592 25929లలో సంప్రదించాలని కోరారు.

పిల్లల చేయిపట్టి.. సర్కార్ బడికి జైకొట్టి

- ప్రభుత్వ పాఠశాలకు పంతుళ్ల పిల్లలు
- నమ్మకం కల్పిస్తున్న టీచర్లు
- స్ఫూర్తి పొందుతున్న తల్లిదండ్రులు
- సర్కార్ స్కూళ్లలో పెరుగుతున్న ప్రవేశాలు

తాము పనిచేస్తున్న సర్కార్ స్కూళ్లపై నమ్మకం పెంపొందించడం.. విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా టీచర్లు తమ పిల్లలను తమతోపాటే తీసుకెళ్తున్నారు. ప్రభుత్వ కొలువు చేస్తూ ప్రైవేట్ స్కూళ్లకు పంపడం సరికాదని.. సర్కార్ స్కూళ్లలో చేర్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని.. ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన సాగుతోందంటూ టీచర్లు చాటిచెబుతున్నారు. పిల్లలను తాము పనిచేస్తున్న స్కూళ్లకు తీసుకెళ్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు.



తమతోనే పిల్లలు



ఉపాధ్యాయ దంపతులు పుర్రె రమేశ్, కవితల కూతురు ఆరాధ్య

రాయికల్: జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన పుర్రె రమేశ్, కవిత దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. రమేశ్ రాయికల్ హైస్కూల్‌లో పీడీగా, కవిత రాయికల్ మండలం ఇటిక్యాలలోని ప్రైమరీ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. వీరి కూతురు ఆరాధ్యను వారు పనిచేస్తున్న స్కూల్‌లో చేర్పించారు. మొదట్లో కవిత పనిచేసిన భూపతిపూర్‌లో 1 నుంచి 3వ తరగతి, ప్రస్తుతం ఇటిక్యాలలో 4వ తరగతిలో చేర్పించారు.

పిల్లలనూ సర్కార్ బడికే..



భార్య, పిల్లలతో ప్రభుత్వ ఉద్యోగి యామ రాజు

ఇల్లంతకుంట: మండలంలోని వంతడుపుల గ్రామానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి యామ రాజు తన ఇద్దరు కూతుళ్లను ప్రభుత్వ బడిలోనే చేర్పించారు. రాజు కూతుళ్లు యామ ధీరజ, తనూజ మండలంలోని రహీంఖాన్‌పేట ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో చదువుతున్నారు. పెద్ద కూతురు ఇంటర్‌లో 987 మార్కులు సాధించి ప్రస్తుతం కోటిలోని ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో చేరింది. చిన్నకూతురు తనూజ మోడల్‌స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది.

తల్లీకొడుకులు ఒకే బడికి..



కుమారుడు శ్రేయాన్‌తో టీచర్ శ్రీలక్ష్మి

కోరుట్ల: ఈ తల్లులు ప్రభుత్వ టీచర్లు. తమ పిల్లలను సైతం వారు పనిచేస్తున్న స్కూళ్లకు తీసుకెళ్తూ విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. కోరుట్ల మండలం అయిలాపూర్‌లో ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న సీహెచ్ శ్రీలక్ష్మి తన కుమారుడు శ్రేయాన్‌ను అదే స్కూల్‌లో 4వ తరగతిలో చదివిపిస్తున్నారు. నిత్యం తనతోపాటు స్కూల్‌కు తీసుకెళ్తున్నారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూళ్లలో స్వేచ్ఛాపూరిత వాతావరణంలో విద్యాభ్యాసం సాగుతోందని, అప్పుడే విద్యార్థుల్లో సృజనాత్మకశక్తి పెరుగుతుందన్నారు.



కుమారుడిని బైక్‌పై స్కూల్‌కు తీసుకెళ్తున్న రాజమణి

కోరుట్లరూరల్: కోరుట్ల మండలం మాదాపూర్ ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ ఎలిగేటి రాజమణి తన కుమారుడిని అదే పాఠశాలలో చదివిస్తోంది. కోరుట్లకు చెందిన రాజమణి తన కొడుకు హిమాన్ష్‌ను తాను పనిచేస్తున్న స్కూల్‌లోనే 3వ తరగతిలో చేర్పించింది. నిత్యం బైక్‌పై కొడుకును తీసుకొని స్కూల్‌కు వెళ్లి వస్తోంది. రెండేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండిలో పనిచేసే సమయంలోనూ తన కొడుకును తీసుకెళ్లేవారు. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ బోధన అందుతుండడంతోనే తీసుకెళ్తున్నట్లు రాజమణి తెలిపారు.

నాన్న వెంటే పిల్లలు



పిల్లలతో ఉపాధ్యాయుడు సత్యనారాయణ

కరీంనగర్‌స్పోర్ట్స్: తాము పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను తీసుకెళ్తున్నారు ఈ తండ్రులు. వీరిని చూసి గ్రామంలోని తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను సర్కార్ బడులకు పంపుతున్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఒద్యారం గ్రామానికి చెందిన సత్యనారాయణ ప్రస్తుతం వేములవాడలోని జెడ్పీ హైస్కూల్(బాలికలు)లో విధులు నిర్వర్తిస్తున్నారు. కరోనా సంక్షోభానికి ముందు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ పిల్లలనూ అక్కడే చదివిపించేవారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం రావడంతో తాను పనిచేస్తున్న స్కూల్‌కే తన పిల్లలను తీసుకెళ్తున్నారు. పెద్ద కూతురు అనన్య ప్రభాస 8వ తరగతి, చిన్నకూతురు ప్రవస్థి 5వ తరగతి చదువుతున్నారు.



ఉపాధ్యాయుడు సతీశ్, కుమారుడు వరుణ్‌తేజ్

కథలాపూర్(వేములవాడ): మండలంలోని దుంపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న లింగంపేట సతీశ్ తన కొడుకు వరుణ్‌తేజ్ అదే స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నారు.



కుమారునితో పాఠశాలకు వస్తున్న తీపిరి సంజీవ్

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన తీపిరి సంజీవ్ స్థానిక మండల పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్నారు. తన కుమారుడు జయసూర్యని కూడా అదే పాఠశాలలో రెండో తరగతి చదివిస్తున్నారు. ప్రతి రోజూ తండ్రీకొడుకులు బైక్‌పై స్కూల్‌కు వెళ్లి వస్తున్నారు.



కొడుకును తీసుకెళ్తున్న ఉపాధ్యాయుడు రాజు

ధర్మపురి: ధర్మపురి మండలం రాయపట్నం స్కూల్‌లో పనిచేస్తున్న బండారు రాజు తన కొడుకు రోహన్‌ను అదే బడిలో 3వ తరగతిలో చేర్పించారు. గతంలో వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటలో పనిచేసిన సమయంలో తన వెంటే కొడుకును తీసుకెళ్లారు.



పిల్లలతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు జావెద్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జావెద్ తన పిల్లలను అదే బడిలో చదివిపిస్తున్నారు. తన పెద్ద కొడుకు నవీదుల్ రెహమాన్‌ను అదే స్కూల్‌లో 7వ తరగతి, చిన్న కొడుకు టిప్పు ఉల్ రహమాన్‌ను దుర్గయ్యపల్లి స్కూల్‌లో 4వ తరగతిలో చేర్పించాడు.

బోధనపై నమ్మకంతో..



కూతురు మధురిమను 9వ తరగతిలో చేర్పించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కిష్టయ్య

వేములవాడ: కథలాపూర్ స్కూల్‌లో పనిచేస్తున్న టీచర్ కిష్టయ్య తన కూతురు మధురిమను వేములవాడలోని బాలికల హైస్కూల్‌లో చేర్పించారు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందనే చేర్పించినట్లు కిష్టయ్య పేర్కొన్నారు.

జమ్మికుంట: ప్రభుత్వ పాఠశాలలో బోధనపై నమ్మకం కల్పించేందుకు తన కుమారుడిని చేర్పించినట్లు టీచర్ బానోత్ సత్యజోస్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పర్లపల్లిలోని స్కూల్‌లో సత్యజోస్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. జమ్మికుంటలో ఉంటున్నారు. ఏడాది క్రితం బదిలీపై పర్లపల్లి పాఠశాలకు వచ్చారు. తన కొడుకు బానోతు సుశాంత్‌ను జమ్మికుంట హైస్కూల్‌లో 9వ తరగతిలో చేర్పించారు.

విద్య వ్యాపారం కాదని..



నర్సింహులపల్లి స్కూల్‌లో కూతురుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మధుసూదన్

సారంగాపూర్: ప్రస్తుతం విద్యను వ్యాపారం చేసేశారని.. కాదని చెప్పేందుకే తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిపిస్తున్నట్లు గొడుగు మధుసూదన్ తెలిపారు. బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లికి చెందిన మధుసూదన్ కండ్లపల్లిలో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. పెద్ద కుమార్తె నిత్య 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రస్తుతం ఇంటర్మీడియెట్‌లో చేరింది. చిన్న కూతురు శ్రీనిధి నర్సింహులపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కండ్లపల్లిలో విధులు నిర్వహిస్తూనే నర్సింహులపల్లిలోని స్కూల్‌కు వెళ్లి అదనంగా ఒక పీరియడ్ బోధిస్తున్నారు.

మామిడి తోట.. పేలిన తూటా!

- ప్రభుత్వంతో చర్చల ప్రతినిధి రియాజ్‌తోపాటు నలుగురి ఎన్‌కౌంటర్
- బందనకల్ ఎన్‌కౌంటర్‌కు 20 ఏళ్లు
- హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నేడు సంస్మరణ సభ
- శాంతమ్మ సమర గాథ సీడీ ఆవిష్కరణ



ముస్తాబాద్ మండలం బందనకల్-మోహినికుంట మధ్య ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం



రియాజ్ అలియాస్ వెంకటేశ్, ప్రభుత్వంతో చర్చల ప్రతినిధి.

సిరిసిల్ల: అది 2005 జూలై 1వ తేదీ... అప్పుడే తెల్లవారుతోంది.. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్-సిద్దిపేట ప్రధాన రహదారి పక్కనే మామిడి తోట.. అక్కడ అన్నీ పోలీసు జీపులు.. సాయుధ పోలీసుల పహరా.. పొలాల వద్దకు వెళ్లే రైతులను అటుగా వెళ్లకుండా.. కట్టడి చేస్తున్న పోలీసులు.. ఏంజరిగిందో తెలియక స్థానికుల హైరానా.. పొద్దెక్కుతోంది.. సూర్యుడు ఎరుపెక్కుతున్నాడు.. నేలపై గడ్డిపరకలపై మంచు బిందులు తడారిపోతున్నాయి.. మామిడి తోటలో నాలుగు శవాలు రక్తం ముద్దలుగా ఉన్నాయి. బందనకల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు సీపీఐ(ఎంఎల్) జనశక్తి నక్సలైట్లు మృతి చెందారు. ఆ ఎన్‌కౌంటర్ మృతుల్లో 2004 అక్టోబరులో ప్రభుత్వం నక్సలైట్లతో జరిపిన శాంతి చర్చల జనశక్తి ప్రతినిధిగా వచ్చిన రియాజ్ అలియాస్ వెంకటేశ్ ఉన్నారు. మరో ముగ్గురిలో మానేరు ప్రాంత దళ నాయకులు గంభీరావుపేట మండలం ముచ్చర్లకు చెందిన రాగుల శ్రీశైలం అలియాస్ విజయ్, సిద్దిపేట జిల్లా చిట్టాపూర్‌కు చెందిన గౌతమ్, జనగామ జిల్లా కడవెండికి చెందిన పెద్దిరాజు ఉన్నారు. ఆ ఘటన జరిగి సరిగ్గా నేటికి 20 ఏళ్లు అవుతుంది.

చెల్లాచెదురుగా శవాలు

బందనకల్-మోహినికుంట శివారుల్లోని మామిడితోటలో ఎన్‌కౌంటర్ శవాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అందరి చేతుల వద్ద కిట్ బ్యాగులు.. ఆయుధాలు.. రియాజ్ శవం వద్ద విప్లవ సాహిత్యం.. తూటా గాయాలతో.. రక్తం గడ్డకట్టి.. నలుపెక్కిపోయింది. శవాలు విసిరేసినట్లుగా పడిఉన్నాయి. అప్పటి జిల్లా ఓఎస్డీ (ఆపరేషన్ ఆన్ స్పెషల్ డ్యూటీ) సంఘటన స్థలానికి వచ్చేంత వరకు మీడియాను అనుమతించకుండా పోలీసులు కట్టడిచేశారు. సాయుధ నక్సలైట్లు మామిడి తోటలో సమావేశమైనట్లు అందిన సమాచారం మేరకు ప్రత్యేక పోలీసులతో గాలింపులు జరుపుగుతుండగా.. పోలీసులను చూసి నక్సలైట్లు కాల్పులు జరిపారు.. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో నలుగురు సాయుధ నక్సలైట్లు చనిపోయారు. మిగితా వాళ్లు తప్పించుకున్నారు.. ఇది ఓఎస్డీ ప్రకటన సారాంశం.

ఎన్‌కౌంటర్‌కు ముందే.. బంధీలు అయ్యారని పత్రికల్లో ప్రకటన

హైదరాబాద్ కాచీగూడ ప్రాంతంలో జనశక్తి చర్చల ప్రతినిధి రియాజ్ మరో ముగ్గురిని అప్పటి కరీంనగర్ జిల్లా పోలీసులు బంధించారని, వారిని ఎన్‌కౌంటర్ చేసే ప్రమాదం ఉందని, రాజ్యాంగ బద్ధంగా వారిపై ఏమైనా పోలీసులు కేసులు ఉంటే.. వెంటనే కోర్టులో హాజరు పరచాలని అప్పటి 'జనశక్తి' ప్రతినిధి చందన్న, ఇతర ప్రజాసంఘాల పేరిట ప్రకటన వెలువడింది. ఆ ప్రకటన అన్ని ప్రముఖ పత్రికల్లో ఎన్‌కౌంటర్ కంటే ముందే ప్రచురితమైంది. కానీ.. ఆ నలుగురిని పట్టించిన కోవర్టును రక్షించుకోడానికి ఆ రాత్రి ఎన్‌కౌంటర్ పోలీసులకు అనివార్యమైంది. శాంతి దూతను చంపుతారా? అంటూ.. అప్పటి టీఆర్ఎస్(బీఆర్ఎస్) ఎమ్మెల్యేలు ఆ ఎన్‌కౌంటర్‌ను ఖండించారు. హోంమంత్రి జానారెడ్డి ఎన్‌కౌంటర్‌పై విచారం వ్యక్తం చేశారు. రియాజ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. చంపి సాయం చేయడం ఏమిటని రియాజ్ భార్య లక్ష్మీదేవి సర్కార్ సాయాన్ని తిరస్కరించారు. అప్పట్లో ఈ ఎన్‌కౌంటర్ చర్చనీయాంశమైంది. ప్రభుత్వం ఒకింత డిఫెన్స్‌లో పడింది. న్యాయవిచారణకు ఆదేశించింది.

కావలి నుంచి సిరిసిల్లకు..

ఎన్‌కౌంటర్ మృతుడు రియాజ్ అలియాస్ వెంకటేశ్ సొంతూరు నెల్లూరు జిల్లా కావలి సమీపంలోని అయ్యంగారిపల్లె. నిరుపేద మత్స్యకారుల కుటుంబంలో పుట్టిన వెంకటేశ్ ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కు వచ్చారు. పుస్తకాల పురుగుగా.. నిరంతరం అధ్యయనం చేసే వెంకటేశ్ ప్రజాఉద్యమాల్లో పాల్గొంటూ.. జనశక్తి పార్టీ పక్షాన 2004లో చర్చల ప్రతినిధి అయ్యాడు. ఆ చర్చల్లో జనశక్తి పక్షాన వేములవాడకు చెందిన కూర దేవేందర్ అలియాస్ అమర్ ప్రముఖుడు. రెండో వ్యక్తి రియాజ్. బందనకల్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన మరో మృతుడు జనశక్తి లీగల్ ఆర్గనైజర్ పెద్దిరాజు విద్యావంతుడు.

మారుమోగిన రియాజ్ పాటలు

బందనకల్ ఎన్‌కౌంటర్ మృతుడు రియాజ్‌పై అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అనేక పాటలను వెలువరించింది. మిత్రకలం పేరుతో అమర్ రాసిన పాటను విమలక్క గానంచేసింది. "కడలి నిన్ను కడుపులోన దాసుకున్న రాతిరి.. అలలే ఊయలగా నిను ఆడించిన రాతిరి.. అయ్యంగారిపల్లె.. హాహాకారాల్లో కరిగి.. కన్నతండ్రి వలలోకి కన్నబిడ్డ నిచ్చిన రుద్రుడు ఆ సముద్రుడికి ఉన్న మనసు.. ఈ కాంగ్రెసు సర్కారుకు లేక పాయే.. రియాజు.. రియాజు నా వెంకటేశా.. అంటూ.. సాగే పల్లవితో వచ్చిన పాటతో పాటు.. బందనకల్ ఎన్‌కౌంటర్ మృతుల స్మృతి గీతాలు ఆరు పాటలు పల్లెల్లో మారుమోగాయి. రియాజ్‌పై అనేక వ్యాసాలు వచ్చాయి. ఆయన రచనలపై పీడీఎస్‌యూ(విజృంభణ) పుస్తకం ప్రచురించింది.

నేడు హైదరాబాద్‌లో సంస్మరణ సభ

బందనకల్ అమరుల 20వ వర్ధంతి సభను హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర అమరుల స్మారక కమిటీ పేరుతో వర్ధంతి సభ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శాంతమ్మ సమరగాథ పాటల సీడీని ఆవిష్కరించనున్నారు. అమర వీరుల స్మారక కమిటీ కన్వీనర్ దేగల రమ, జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, జీవన్‌కుమార్, ఆచార్యా కట్టా భగవంతరెడ్డి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షురాలు విమల, నాగిరెడ్డి, వెల్తురు సదానందం, మల్లేశం, టి.అంజయ్య, అల్లూరి విజయ్, ఏపూరి మల్సూర్, రమేశ్ పోతుల, అరుణ, రాయమల్లు పాల్గొననున్నారు.